

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
గురువారం 25 సెప్టెంబరు 2025





సమ్మక్కసాగర్ బ్యారేజీ(ఫైల్)



# సాగునీటి చిక్కులు 'సమ్మక్క' తీర్చేనా!?

- సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీకి చత్తీస్‌గడ్ సానుకూలతపై హర్షం
- కాళేశ్వరం, సమ్మక్కసాగర్ కింద ఎస్సారెస్పీ-2 రెండు లక్షల ఎకరాల ఆయకట్టు
- రెండు ప్రాజెక్టుల కింద ఒకే ఆయకట్టును చూపటంపై సీడబ్ల్యుసీ అభ్యంతరాలు
- ఎన్‌వోసీ వచ్చినా.. కొత్తగా 2లక్షల ఎకరాల ఆయకట్టు చూపిస్తేనే అనుమతులు
- కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోవటంతో ఎస్సారెస్పీ-2కింద సాగునీటికి కొరత
- సీతారామ ప్రాజెక్టుకొత్త డిజైన్‌లో మహబూబాబాద్, డోర్నకల్‌కు దక్కని చోటు
- పాకాల నుంచి బయ్యారం వరకు గోదావరి జలాలను మళ్లించాలంటున్నరైతులు
- సమ్మక్కనీళ్లు ఎస్సారెస్పీ-2 స్థిరీకరణ, పాకాల-బయ్యారం కొత్త ఆయకట్టుకా..?

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సమ్మక్క సాగర్ బ్యారేజీకి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఇవ్వడానికి చత్తీస్‌గడ్ సానుకూలత వ్యక్తం చేయటం రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుండగా.. కొత్త ఆయకట్టుపై సీడబ్ల్యుసీ అభ్యంతరాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కింద చూపించిన ఎస్సారెస్పీ-2 ఆయకట్టును సమ్మక్క సాగర్ కింద చూపించటం ఏమిటని సీడబ్ల్యుసీ ప్రశ్నిస్తోంది. సమ్మక్కసాగర్‌కు కొత్త ఆయకట్టు చూపించాలని సీడబ్ల్యుసీ కోరుతోంది. దీంతో ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు అలైన్ మెంట్ మార్పులతో మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు నియోజకవర్గాలకు సాగునీరు అందే పరిస్థితి లేనందున, పాకాల వరకు వెళుతున్న గోదావరి జలాలను బయ్యారం వరకు మళ్లించి కొత్తగా సమ్మక్కసాగర్‌కు ఆయకట్టును సృష్టించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సమ్మక్క నీళ్లను పాకాల నుంచి బయ్యారం మళ్ళిస్తే.. కాళేశ్వరం ఎత్తిపోతలు లేకపోవటంతో ఎస్సారెస్పీ-2 కింద రైతులకు సాగునీటి పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. దీంతో సమ్మక్కసాగర్ నీటితో ఎస్సారెస్పీ-2 ఆయకట్టును స్థిరీకరించాలా? లేక పాకాల- బయ్యారం లింకులో కొత్త ఆయకట్టు సృష్టించాలానే సందిగ్ధం అధికారయంత్రాంగంలో నెలకొంది.



### ఎస్సారెస్పీ-2పై అభ్యంతరాలు

దేవాదుల ఎత్తిపోతలను పెంచేందుకు ప్రభుత్వం 2018లో తుపాకులగూడెం వద్ద గోదావరిపై సమ్మక్కసాగర్‌ను నిర్మించింది. ఈ బ్యారేజీతో 6.94 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం

(మిగతా 7లో..)

### సీతారామ కష్టాలను సమ్మక్క తీర్చేనా..?

భద్రాద్రి కొత్తగూడెంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టును ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించేందుకు ప్రభుత్వం చేపట్టింది. అయితే కిన్నెరసాని అభయారణ్యం కారణంగా అనుమతులు రావడంలో ఆలస్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ఇటీవల సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసింది. ఈ మార్పులతో మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాలోని బీడు భూములకు గోదావరి నుంచి నీరందే పరిస్థితి లేదు. సీతారామ ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేసినప్పుడు టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు వద్ద 16 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. ఈ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారానే ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు నీరందించే వీలుంది. ఎలాంటి చిక్కులు లేకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం నుంచి రోళ్లపాడుకు నీరందించి, ఆ లోటును భర్తీ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఇప్పటికే సమ్మక్క సాగర్ నీరు దేవాదుల ద్వారా రామప్ప వరకు చేరుతోంది. రామప్ప నుంచి వరంగల్ జిల్లా పాకాల సరస్సులోకి మళ్లిస్తున్నారు. పాకాల నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద చెరువులోకి మళ్లించి, అక్కడి నుంచి ఇల్లందులోని రోళ్లపాడు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను మళ్లిస్తే.. సీతారామ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే అంశంపై ఇటీవల మంత్రి సీతక్క, ప్రభుత్వం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొత్తగా లక్ష ఎకరాలకు వరకు సాగునీరు అందించటంతో పాటు మరో లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పేదల పెన్నిధి సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రజాభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు
- మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సీఎం రేవంత్‌రెడ్డి పేదల పెన్నిధిగా నిలుస్తున్నారని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 105మంది లబ్ధిదారులకు రూ.40,50,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలాగా చూస్తూ ముందుకు నడిపిస్తోందని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ ఆర్థిక భారం పడుతున్నప్పటికి, కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ఆదివాసీలు, లంబాడీలు అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటున్నారని, వారి మధ్య ఏమైనా సమస్యలుంటే పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, హెచ్.వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నూనావత్ రమేష్, బానోత్ ప్రసాద్, వంశీనాయక్, రియాజ్ అన్సారీ, అమరేందర్‌రెడ్డి, భాస్కర్, జగదీష్, మాలోతు అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

# మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న మండల వెంకన్న

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కులన్మోద, మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. జ్యోతిబాపూలే స్థాపించిన 'సత్యశోధక్ సమాజ్' 152వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలేకు విద్యనేర్పించి.. స్త్రీకి విద్య కావాలని మనుధర్మశాస్త్రాన్ని, సనాతన ధర్మాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక కవులు, రచయితలపై దాడులు, దళిత మైనార్టీలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈనెల 24 నుంచి 30 వరకు ఎన్డీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్.లింగన్న, శివ్వారపు శ్రీధర్, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య. పర్వత కోటేష్, నిజాముద్దీన్, కృష్ణవేణి, రజిత, కల్పన, శ్రీను, కొమరయ్య, శారద, కల్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

## కార్మిక హక్కుల కోసం పోరాడుదాం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి

8

# ఘనంగా ప్రారంభమైన 'ఉదయం' షోరూం

ప్రాంతీయ, సంప్రదాయ దుస్తులకు నిలయం

హనుమకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురుషుల నిర్దిష్ట ప్రాంతీయ, సంప్రదాయ దుస్తులకు సంబంధించి దక్షిణ భారతదేశంలోని అత్యంత విశ్వసనీయమైన పేర్లలో ఒకటైన 'ఉదయం' హనుమకొండలో తన ప్రత్యేక షోరూంను ఏర్పాటు చేసింది. సుబేదారి రోడ్డులో ఏర్పాటైన ఈ షోరూంను బుధవారం ఉదయం లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 320 ఎఫ్, సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, లయన్ డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య లాంఛనంగా ప్రారంభించారు. హనుమకొండ రెడ్ క్రాస్ ఛైర్మన్, ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ్‌చందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రాపర్టీ యజమాని వైట్ల జనార్ధన్ తొలి కొనుగోలు చేశారు. ఉదయం పూర్తిస్థాయి ఉత్పత్తులైన ధోతీలు, చొక్కాలు, వెడ్డింగ్ సెట్, మ్యాచింగ్ సెట్, నిర్దిష్ట ప్రాంతీయ సెట్, షర్టింగ్, సూటింగ్, పంచకచ్చమ్, చిన్నారుల ధోతీలు, చొక్కాలు, టవల్స్, లోదుస్తులు ఈ షోరూంలో అందుబాటులో వున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సంప్రదాయం, సొగసు, సౌకర్యాన్ని మిళితం చేసిన అపూర్వమైన షాపింగ్ అనుభవాన్ని కస్టమర్లు పొందవచ్చని తెలిపారు. నాణ్యత, సంప్రదాయం, నూతనత్వానికి సంబంధించిన నిబద్ధతతో వినియోగదారులకు నిర్దిష్ట ప్రాంతీయ, సహజమైన దుస్తులను అందించాలనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు.



ఉదయం షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

## సద్దుల బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు ఘనంగా చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపం బతుకమ్మ పండుగ అని, జిల్లాలో సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 29 వరకు తెలంగాణ ఆడపడుచుల పండుగ బతుకమ్మ వేడుకలు అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్ జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఏర్పాట్లు చేయాలని, బతుకమ్మ ఆడే ప్రదేశాలు, కుంటలు, చెరువులు, దేవాలయ ప్రదేశాల్లో ప్రభుత్వం సూచించిన ప్రకారం విద్యుత్ కాంతులతో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జనం కోసం సూచించిన ప్రదేశాల్లో క్రేన్లు, లైటింగ్, శానిటేషన్, బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ, మహిళా భద్రత, సఖి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మెప్మా, స్వయం సహాయక సంఘాలు, వైద్య, ఆరోగ్య, రెవెన్యూ తదితర విభాగాల సంక్షేమ పథకాలు అమలు ప్రదర్శన ద్వారా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లాలోని తెలంగాణ సంస్కృతి సారథి సభ్యులు, ఇతర కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు తిరుపతిరావు, పురుషోత్తం, మరియన్న, హరిప్రసాద్, ప్రేమ్‌కుమార్, రాజేంద్ర ప్రసాద్, విజయ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

# బెల్టు షాపుల జోరు.. జనం బేజారు

## జిల్లాలో 1,224 కేసులు.. అయినా ఆగని దందా

- విచ్చలవిడిగా గుడుంబా అమ్మకాలు
- ఆగని బెల్లం అక్రమ దందా
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ శాఖ





ఏటీగడ్డతండాలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బెల్టు షాపులు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. వాడవాడకూ ఏర్పాటు అవుతోండడంతో మందు బాబుల చేబులకు చిల్లులు పడుతున్నాయి. గ్రామాలు, తండాల్లో జోరుగా బెల్టుషాపులు, గుడుంబా అమ్మకాలు సాగుతోండడంతో మందు ప్రియులు మత్తులో జోగుతున్నారు. దసరా దగ్గర పడుతుండడంతో పండుగకు పట్టణ శివారు గ్రామాల్లో ఇప్పటికే గుడుంబా, బెల్లం దంపులు పెద్దఎత్తున దిగాయనే ఆరోపణలు వస్తున్నా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### గ్రామాల్లో గుడుంబా ఫుల్..

మహబూబాబాద్ జిల్లాలో మద్యం, గుడుంబా ఏరులై పారుతున్నా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తూ, చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామా ల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం అ మ్మకాలు జోరుగా కొనసాగుతున్నా చోద్యం చూస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 5 గంటల నుంచే మద్యం అమ్మకాలు జరుగుతుండడంతో మద్యం ప్రియులు ఆ సమయంలోనే తాగి రోడ్లపై దొర్లుతున్నారని.. అయినా, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాటి ని పట్టించుకోవడం లేదన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రోజంతా మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండడంతో వాటిని తాగిన మద్యం ప్రియుల ఇళ్లలో

(మిగతా 8లో..)

### ఆగని బెల్లం దందా..

జిల్లాలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కొంతమేర దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నప్పటికి బెల్లం, పటిక, గుడుంబా అక్రమంగా రవాణా చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాలు, పట్టణాలు, గిరిజన తండాలను కేంద్రంగా చేసుకుని ధనార్జనే ధ్యేయంగా తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయం సంపాదించాలని అక్రమార్కులు అధికారుల ఎత్తులకు పైఎత్తులు వేస్తూ అక్రమ రవాణాకు కొత్తపుంతలు తొక్కుతున్నారు.

### అబ్కారి అధికారి అప్‌అండ్‌డౌన్..

జిల్లా ఆబ్కారిలో టాస్క్‌ఫోర్స్ సీఐ స్థాయి అధికారి రోజువారిగా ఓ ఎక్స్‌ప్రెస్ టూ ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్ చేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేసే సిబ్బంది సైతం నిర్లక్ష్యంగానే పనిచేస్తున్నారు. సదరు అధికారి ఏదో డ్యూటీకి వచ్చామా! వెళ్లామా అనే రీతిలో ఉదయం ఎక్స్‌ప్రెస్‌కు వరంగల్ నుంచి మహబూబాబాద్‌కు రావడం, మానుకోట నుంచి సాయంత్రం వరంగల్‌కు వెళ్లడం పరిపాటిగా మారింది. నెలలో ఒకటి రెండు దాడులు జరిపి చేతులు దులుపుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన టాస్క్‌ఫోర్స్ అధికారి ఇలా అప్‌అండ్‌డౌన్ చేసి విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే జిల్లాలో మాదకద్రవ్యాలు, గుడుంబా, మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఏమైనా అంటే కొద్ది రోజుల్లో వరంగల్‌కు బదిలీ అవుతానని.. ఏదో నడిపిస్తున్నాం కదా అని మాట్లాడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి దృష్టి సారించి టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

# శాకంబరి అలంకరణలో దుర్గామాత



కేసముద్రం ఆర్యవైశ్యభవన్‌లో శాకాంబరి అలంకరణలో దుర్గామాత

కేసముద్రం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేసముద్రం ఆర్యవైశ్యభవన్‌లో దుర్గాదేవిని బుధవారం రాత్రి వివిధ రకాల కూరగాయలతో శాకంబరిదేవి రూపంలో అలంకరించారు. ఉదయం సామూహిక లక్ష్మి కలశార్చన నిర్వహించారు. శ్రీరాం చంద్రన్‌కుమార్, వేమ సంతోష్, మాలె రవి, సామ ప్రకాశ్, చిల్లంచర్ల సతీష్, బోగోజు వే ణుగోపాలాచారి, మడూరి దినేష్, రాపోలు శ్రీనివాస్, రాపాక కుమారస్వామి, కముటం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పృథ్వీకి ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు

రాష్ట్రపతి నుంచి స్వీకరణ

7

## 20 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

● డీసీఎం, కారు సీజ్.. ముగ్గురిపై కేసు నమోదు



పట్టుబడిన డీసీఎం, నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలంలో బెల్లం వ్యాపారం అక్రమంగా కొనసాగుతుండగా వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా బుధవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. తొర్రూరు ఎక్సైజ్ సీఐ బి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... తొర్రూరు ఎక్సైజ్ అధికారులు చేపట్టిన రూట్‌వాచ్‌లో భాగంగా మండలంలోని హరిపిరాల గ్రామ శివారులో గుడుంబా తయారు చేయడానికి ఉపయోగించే 40 బస్తాల బెల్లం(20 క్వింటాళ్లు), 75కిలోల పటికతోపాటు 40 లీటర్ల గుడుంబాను డీసీఎంలో తరలిస్తుండగా వెంబడించి పట్టుకున్నట్లు వెల్లడించారు. అక్రమంగా బెల్లం, పటికను తరలిస్తున్న కొత్తపల్లి సైదయ్య, గుగులోతు సురేష్, ఇస్లావత్ విజయ్‌లపై కేసు నమోదు చేసి, డీసీఎం, కారును సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో గుడుంబా తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బి.అశోక్ హెచ్చరించారు. ఈదాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కె.నాగయ్య, నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ ఎస్సైలు రవళి, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్‌లను పంపిణీ చేయాలి

● ఇళ్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరుపేదల ఆందోళన



పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పేదలు, సీపీఎం నాయకులు

తొర్రూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో నిర్మాణం పూర్తయి ఉన్న రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలు బుధవారం ఇళ్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, ఐద్వా నాయకురాలు మమత మాట్లాడుతూ గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేసిందన్నారు. గత 4 నెలలుగా అర్హులైన వారికి ఇళ్లు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించిందన్నారు. స్థానిక ఎన్నికల కోడ్ రాకముందే దసరా రోజు ఇళ్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇళ్లను ఆక్రమించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, యాకూబ్, యాకయ్య, దర్గయ్య, స్వామి, వెంకటేశ్వర్లు, శోభ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత సృష్టించింది కేంద్రమే

● ప్రజల కష్టాల్లో నేతలు పాలుపంచుకోవాలి

● ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మాట్లాడుతున్న విప్ రాంచంద్రునాయక్

నర్సింహులపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం యూరియా కొరత సృష్టించడంతో ప్రతీ రైతు నష్టపోయారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారంలో పాల్గొనిమాట్లాడారు. ప్రతీ లీడర్ ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలని, ప్రజల్లో తిరిగిన వారికి మాత్రమే పదవులు వస్తాయని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వేంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ వేముల విజయపాల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు దర్శరపు రాములు, మేక సుధాకర్‌రెడ్డి, గాడుదుల సోమలింగం, ఉంగరాల మధుసూదన్, బానోతు జ్యోతి, నందనాచార్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడుదుల రామకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పోలేపల్లి రజినీకాంత్ రెడ్డి, వెన్న రవీందర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు రేఖఅనిల్ యాదవ్, తోట సురేష్, అలువాల శ్రీనివాస్, కాస యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



భద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యానాయక్

## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

చిన్నగూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి రెడ్యానాయక్ పరామర్శించారు. మన్నెగూడెం గ్రామానికి చెందిన బంటు భద్రమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేసముద్రం మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ బంటు ఉపేందర్, బొమ్మకంటి వెంకట్, రాసమల్ల వెంకన్న, వెంకన్న, నాగమల్లేష్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ విప్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు

మరిపెడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్‌తోనే నియోజకవర్గంలోని నిరుపేదలకు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మరిపెడలోని గెస్ట్‌హౌస్‌లో పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గుగులోత్ రవి, బిక్కునాయక్, హేమానాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు పేరుతో కేంద్రం మోసం

తొర్రూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు పేరుతో 100 కోట్ల మంది భారతీయులను మరోసారి మోసం చేస్తుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపెల్లి రవి అన్నారు. తొర్రూరు పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా రూ.8లక్షల కోట్లను జీఎస్టీ పేరుతో వసూలు చేసిన ప్రధాన మోదీ నేడు స్లాబ్ రేటు తగ్గించామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతున్న నేపథ్యంలో మిగులు వస్తువుల ఉత్పత్తిని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం తగదన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే ఆహార ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, యాకూబ్, నవీన్, మురళి పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌పై మరమ్మతులు చేపట్టాలి

● గుంతల వద్ద సీపీఎం కార్యకర్తల ఆందోళన



ఎన్‌హెచ్‌పై గుంతల వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

మరిపెడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఏ-563పై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని మరిపెడ పట్టణ సీపీఎం కార్యకర్తలు బుధవారం ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ బాధ్యులు బాణాల రాజన్న మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోజుకొక్కరు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు సైతం దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా మునిసిపల్ అధికారులు స్ట్రీట్ లైట్లు పెట్టకపోవడంతో రాత్రిపూట గుంతలు కానరాక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఆందోళనలో పార్టీ మరిపెడ టౌన్ కార్యదర్శి దొంతు సోమన్న, నాయకులు అనంతాచారి, శ్రీనివాస్, రమేశ్, గౌసొద్దీన్, యాదగిరి, ఎల్లయ్య, చంద్రకళ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఆఫ్రిన్

మరిపెడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మరిపెడ హైస్కూల్ విద్యార్థిని ఎస్కే.ఆఫ్రిన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం అనంతరావు, పీడీ రాజకుమారి తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన మహబూబాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఆఫ్రిన్ అత్యంత ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. కాగా, ఆఫ్రిన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## చింతలకుంటలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దవంగర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంట్లకుంట గ్రామ శివారు చింతలకుంటలో కమ్మగాని అశోక్ అనే వ్యక్తి గల్లంతైన విషయం విదితమే. కాగా, బుధవారం ఆ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన ప్రకారం... మండలంలోని అవుతాపురంకు చెందిన అశోక్(35) గ్రామంలోనే కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. టీవీ కేబుల్ నెట్‌వర్క్ వైరు కొడకండ్ల నుంచి అవుతాపురం వరకు ఉండగా, గంట్లకుంట గ్రామ శివారులోని చింతలకుంటలో కరెంట్ స్తంభానికి ఏర్పాటు చేసిన కేబుల్ వైరు తెగిపోయింది. దీంతో వైరును మరమ్మతు చేయడానికి వచ్చిన వారికి సహాయం చేయడానికి మంగళవారం ఈత కొడుతూ వెళ్లిన కమ్మగాని అశోక్ మధ్యలోనే నీటిలో మునిగిపోయినట్లు తెలిపారు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. స్థానికులు బాధిత కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎస్సై క్రాంతికిరణ్ చేరుకుని పరిశీలించారు. రెస్క్యూ టీమ్, ఫైర్ సిబ్బంది, ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా అశోక్ ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం చింతలకుంటలో అశోక్ మృతదేహం లభ్యమైంది. అశోక్ కుటుంబ సభ్యులకు కేబుల్ నెట్‌వర్క్ యాజమాన్యం న్యాయం చేయాలని కోరుతూ పోలీసు స్టేషన్ సమీపంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తొర్రూరు సీఐ గణేష్ బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేస్తామని నచ్చజెప్పి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, అశోక్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దయాకర్‌రావు కమ్మగాని అశోక్ (ఫైల్)

### బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

చింతలకుంటలో గల్లంతై మృతి చెందిన కమ్మగాని అశోక్ భౌతికకాయాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. మృతుడి కుటంబసభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, సల్దెండి సుధాకర్, కోట అశోక్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

## 'నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం'

డోర్నకల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని కురవి ఏడీఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తమ సిబ్బందికి ఫోన్ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి ప్రాంతాల వారీగా విద్యుత్ సిబ్బంది నంబర్లను వెల్లడించారు. కురవి ఏడీఈ: 8712481663, ఏఈ డోర్నకల్: 8712481604, సబ్ ఇంజనీర్ డోర్నకల్: 8712481605, లైన్ ఇన్‌స్పెక్టర్ (పెరుమాండ్ల సంకీస) 8712481600, లైన్ ఇన్‌స్పెక్టర్ (మన్నెగూడెం) 8106890444, ఏఎల్‌ఎం డోర్నకల్ 8985788872, ఏఎల్‌ఎం బంజర 8074148943, ఏఎల్‌ఎం ఉయ్యాలవాడ 9502323071, ఏఎల్‌ఎం గొల్లచర్ల 6281556342, ఏఎల్‌ఎం వెన్నారం 9704097500, ఏఎల్‌ఎం సంకీస 9989530272, డోర్నకల్ సబ్‌స్టేషన్ 8712481595, గొల్లచర్ల సబ్‌స్టేషన్ 8712481596, మన్నెగూడెం సబ్‌స్టేషన్ 8712481597, పెరుమాండ్ల సంకీస సబ్‌స్టేషన్ 8712481598 నెంబర్లను సంప్రదించాలన్నారు.



# సంపన్న వర్గాలకు సేవ చేస్తున్న పాలకవర్గాలు

● విప్లవోద్యమానికి ప్రమాదకరంగా మితవాదం

● విప్లవ పార్టీ విలీన సభలో రాష్ట్ర నేతలు



బయ్యారంలో జరిగిన సభలో అభివాదం చేస్తున్న విప్లవ నేతలు

బయ్యారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పాలకవర్గాలు స్వదేశీ, విదేశీ సంపన్న వర్గాలకు సేవ చేస్తూ, దేశ సంపదను దోచిపెడుతున్నాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రివల్యూషనరీ (ఎన్డీఆర్) రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి విమర్శించారు. బయ్యారంలో బుధవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రివల్యూషనరీ (ఎన్డీఆర్) విప్లవ పార్టీల విలీన సభ జరిగింది. ఈ సభలో వారు మాట్లాడుతూ విప్లవోద్యమంలో మితవాదం, అతివాదం తీవ్ర నష్టాలు కలిగించిందని, మితవాదం నేడు విప్లవోద్యమానికి తీవ్ర ప్రమాదకరంగా మారిందన్నారు. అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూలదోయడానికి రూపొందించిన ప్రతిఘటన పోరాటల వెలుగులో పనిచేయటానికి రెండు విప్లవ పార్టీలు విలీనమైనట్లు పేర్కొన్నారు. దేశంలో పారిపాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం హిందుత్వ పార్లమెంటరీ ఫాసిజాన్ని ప్రయోగిస్తూ లౌకికవాద, శక్తులను, విప్లవశక్తులను, ప్రశ్నించే గొంతులను హత్యచేయటం, నల్ల చట్టాలను ప్రయోగించి జైళ్లలో పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు ఆదివాసీ ప్రజలపై దారుణ హింసకాండను ప్రయోగిస్తోందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో అంతిమ యుద్ధం చేస్తూ వందల మందిని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యాకాండను జరుపుతుందని విమర్శించారు. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్య సాధన కోసం సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీగా వర్గపోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రతీన పూనారు. అంతకుముందు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణోదయ కళారూపాలు ఆకర్షించాయి. మేక రామ్‌రెడ్డి, సనప పొమ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఊక్లా, మల్లేష్, మదార్, రామకోటి, శ్రీనివాస్, రామ్‌సింగ్, పాపారావు, రామచంద్రు, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కవిత, యాకయ్యపాల్గొన్నారు. కాగా,, ఈ సందర్భంగా ఇఫ్టూ జాతీయ నేత ముఖ్తార్ పాష 5వ వర్ధంతి సందర్భంగా నేతలు నివాళులర్పించారు.

## అన్నదానం గొప్పది: ఎస్సై



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రియాజ్ పాషా

గార్ల సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకంటే అన్నదానం గొప్పదని ఎస్సై ఎస్‌కే రియాజ్ పాష అన్నారు. బుధవారం దుర్గా శరన్ననవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద దర్గాదేవి మండపం వద్ద దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు.

### అన్నపూర్ణగా దుర్గాదేవి దర్శనం..

మండలంలోని వివిధ గ్రామాల్లో దేవి నవరాత్రుల వేడుకలు కొనసాగుతున్నాయి. బుధవారం అన్నపూర్ణ దేవతగా దుర్గాదేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే మాలలు ధరించిన స్వాములు, భక్తులు పూజలు చేశారు. పురోహితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వ రరావు, హతీరాంనాయక్, విమల్‌కుమార్ జైన్, గోపాల్ జైన్, దుర్గా మాత విగ్రహ ప్రధాన నిర్వాహకుడు గుగులోత్ శ్రీను నాయక్, కోటేష్ పాల్గొన్నారు.

## 'సీఎం సహాయనిధి ఒక వరం'

కురవి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు వరం లాంటిదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. కొత్తూరు(జి), బంచరాయి తండా, పెద్దతండాల్లో ఆరుగురు లబ్ధిదారులకు సుమారు రూ.2.50 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలోని నిరుపేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయ్యాల శ్రీధర్, భట్టు ఉప్పలయ్య, విజయ్‌నాయక్, విష్ణు, పూల్యా, కృష్ణ, రామారావు, కట్ల వెంకన్న పాల్గొన్నారు.

## అనాథ మహిళకు దుస్తుల పంపిణీ

గార్ల సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రైల్వే స్టేషన్‌లో గత కొంత కాలంగా బిక్షాటన చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్న అనాథ మహిళకు పట్టణంలోని కొందరు యువకులు బుధవారం దుస్తులు, దుప్పట పంపిణి చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కత్తి బాలరాజు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, బాబులాల్ నాయక్, యాకుబ్ పాష, వీరస్వామి, పల్లా నర్సయ్య, వేసమల్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

## దుర్గామాతకు సత్యవతి పూజలు



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

కురవి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కురవి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పూజలు జరిపారు. దుర్గాదేవి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళలతో బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు సంగెం భరత్, దుడ్డెల వినోద్, వేమిశెట్టి శ్రీను, ఆమెడ మల్లికార్జున్, సీహెచ్.సంతోష్, శరత్, దైద ప్రదీప్, బీఆర్‌ఎస్ నాయకులు బాదె నాగయ్య, బోడ శ్రీను, నెహ్రూనాయక్, కిశోర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్తార్ పాషా 5వ వర్ధంతి

బయ్యారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఇఫ్టూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముఖ్తార్ పాష 5వ వర్ధంతిని బుధవారం ఆ పార్టీ నేతలు కొత్తపేటలో జరుపుకున్నారు. వర్ధంతి సందర్భంగా పాషా స్మారక స్థూపం వద్ద సంస్మరణ సభ నిర్వహించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, నాయకులు జడ సత్యనారాయణ, బండారి ఐలయ్య, మురళీకృష్ణ, నందగిరి వెంకటేశ్వర్లు, పద్మ, పుల్లన్న, సక్కు, వీరభద్రం, బిక్షం, వెంకన్న, రాకేష్, నరసింహా, హోలీ, యాకూబ్ పాష, రవి, గణేష్, సోమక్క, తిరుమలేష్ పాల్గొన్నారు.

## రహదారి విస్తరణ పనులు షురూ

డోర్నకల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మండలం మీదుగా మహబూబాబాద్- కోదాడ వెళ్తున్న జాతీయ రహదారి 365/ఏ విస్తరణ పనులు ముల్కలపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు 83 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల రహదారిగా విస్తరించడానికి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. దీంతో రహదారి విస్తరణకు అవసరమైన భూములను గతంలో గుర్తించారు. ఈ రహదారి విస్తరణ వల్ల ప్రయాణీలకు దూరాభారం తగ్గడంతో పాటు మేలు చేకూరనుంది.

## ముగిసిన కబడ్డీ కోచింగ్ క్యాంప్



సబ్ జూనియర్ కబడ్డీ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు

కురవి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కురవిలో కబడ్డీ జిల్లా జట్ల కోచింగ్ క్యాంప్ గురువారంతో ముగిసింది. రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలుర, బాలికల జట్లకు కురవిలో పదిరోజుల పాటు కోచింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈనెల 25 నుంచి నిజామాబాద్‌లోని ముక్తల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో జిల్లా జట్లు పాల్గొననున్నాయి. ఈ క్యాంప్‌ను కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు చాంప్లా నాయక్, గుమ్మళ్ల సురేందర్, దామోదర్‌రెడ్డి, అన్వేష్ పర్యవేక్షించారు.

## వేడుకలు ఘనంగా నిర్వహించాలి

● ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీనివాస్‌రావు



సీతంపేటలో ప్రారంభించిన బతుకమ్మ ఘాట్

గార్ల సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని బతుకమ్మ ఘాట్ వద్ద వేడుకలను వైభవంగా జరుపుకోవాలని విశాఖపట్నానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఊరుకొండ శ్రీనివాస్‌రావు అన్నారు. సీతంపేటలో ఊరుకొండ కృష్ణమూర్తి జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను శ్రీనివాస్‌రావు-విజయశ్రీ దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో బుడిగ వెంకటేశ్వర్లు, ఊరుకొండ నర్సింహారావు, పర్సూరి వెంకటేశ్వర్లు, గోదాల వెంకట్‌రెడ్డి, మాలోత్ బిక్కునాయక్, మాలోత్ శివ నాయక్, మోకాళ్ల రామచంద్రు, మురళి పాల్గొన్నారు.

# ఫార్మసిస్టులపై నిర్లక్ష్యమేల!?

- ఉమ్మడి జిల్లాలో 70కి పైగా ఫార్మసిస్టు పోస్టులు ఖాళీ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల కొరత
- ఉన్నవారిపైనే అధిక పనిభారం
- సక్రమంగా అమలుకాని చట్టం
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

హనుమకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫార్మసిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోగికి మందులు అందజేయడం మొదలు పెట్టినప్పటి నుంచి రోగం నయం అయ్యే వరకు ప్రతీ దశలోనూ ఫార్మసిస్టు కీలక పాత్ర పోషిస్తారు. పరిశోధనలు చేసి ఔషధాలను కనిపెట్టే వారు, వాటిని తయారు చేసేవారు, ప్రజలకు చేరవేసే వారు, ఔషధ గుణాలను రోగికి వివరించి సలహాలు సూచనలు అందించే మెరుగైన వైద్యవనరులుగా ఫార్మసిస్టులను వినియోగించుకోవలసిన ప్రభుత్వాలు వారి విషయంలో చిన్నచూపును ప్రదర్శిస్తున్నాయి.

### మందుల కొరత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రా లు, బస్తీ దవాఖానాలలో తీవ్రమైన మందుల కొరత ఉంది. రోగు లు బయట మందులు కొనుక్కోవలసిన పరిస్థితి ఉంది. రోగులు ఇందుకు ఫార్మసిస్టులను బాధ్యులను చేస్తూ వారిపై దూషణలకు దిగుతుండడం తరుచూ జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో మందులు ఉన్నా ఇవ్వడం లేదన్న కోపంతో వారిపై దాడు లు జరిగిన ఉదంతాలు కూడా ఉన్నాయి. మందుల కొరతను నివారించడంలో ఫార్మసిస్టులకు వైద్యులు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు సహకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీరితో కొరవడిన సమన్వయం ఫార్మసిస్టులను ఇబ్బందుల పాలు చేస్తోంది. కమ్యూనిటీ ఫార్మసీలలో రోగులు ఎదుర్కొనే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొవడంలో ఫార్మసిస్టులకు శిక్షణ, వనరులు అవసరం. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



### అర్హులెక్కడ?

ఉమ్మడి జిల్లాలో 2400 రిటేల్ మెడికల్ షాపులు, 450 మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో అర్హులైన ఫార్మసిస్టులు ఉండడం లేదు. నిబంధనల ప్రకారం వారి సర్టిఫికెట్ల ఆధారంగానే లైసెన్సులు తీసుకుంటున్నారు. పేరుకు షాపుల్లో గోడలపై సర్టిఫికెట్లు దర్శనమిస్తున్నాయి కానీ.. అందులో వారు ఉండడం లేదు. ఇది ఫార్మసీ చట్టానికి విరుద్ధం. ఒక ఫార్మసిస్టు తన సర్టిఫికెట్‌ను అనధికారికంగా ఇంకొకరి దగ్గర కుదువ పెట్టరాదు. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నది ఇదే. మందుల షాపులు, మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులు లైసెన్సుడు ఫార్మసిస్టులను తగిన వేతనంతో ఉద్యోగాల్లో పెట్టుకుంటే చాలా వరకు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుంది.

### పదినెలవుతున్నా ఫలితాలేవి?

రాష్ట్రవ్యాప్తంగా 700 ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కిందటేడు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 98 పోస్టులు ఉన్నాయి. పరీక్షలు పూర్తయినా ఇంత వరకు ఫలితాలను ప్రకటించలేదు. పరీక్ష రాసిన నిరుద్యోగులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొంత మంది కోర్టుకు వెళ్లడం వల్ల ఫలితాల ప్రకటనలో జాప్యం జరుగుతున్నట్టు చెబుతున్నా ఈ విషయంలో ప్రభుత్వం తన వంతు చొరవ చూపడం లేదు.

### డైరెక్టర్ పోస్టు భర్తీ ఎప్పుడు?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ పోస్టు ఆంధ్రకు వెళ్లింది. తెలంగాణలో ఈ డైరెక్టర్ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. ఎంతో కాలం తర్వాత డైరెక్టర్ పోస్టు మంజూరైనా భర్తీ మాత్రం జరగలేదు. ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి నెట్టుకువస్తున్నారు. అన్ని అర్హతలున్న, ఫార్మసిస్టు నిపుణులను డైరెక్టర్‌గా నియమించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 71 డ్రగ్‌ఇన్స్‌పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు పోస్టులు ఇప్పటికీ భర్తీ కాలేదు.

### పెద్ద సంఖ్యలో ఖాళీలు

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా ఉంది. పెద్ద సంఖ్యలో ఫార్మసిస్టుల ఖాళీలు ఉన్నాయి. ఫార్మసిస్టులు లేని చోట డాక్టర్లు, చివరికి నర్సులే ఫార్మసిస్టుల అవతారం ఎత్తి రోగులకు మందులను అందజేస్తున్నారు. రోగుల సంఖ్యకు సరిపడే ఫార్మసిస్టులు లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే అధిక పని భారం పడుతోంది. ఆస్పత్రుల్లోని మందుల కౌంటర్లలో అత్యవసర రోగులకు అవసరమైన మందులను అందచేయడానికి నైట్ డ్యూటీలో ఫార్మసిస్టులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల పోస్టుల ఖాళీ వల్ల నైట్ డ్యూటీలో ఫార్మసిస్టులు లేక రోగులు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

### ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను గుర్తించాలి



ప్రజారోగ్య సంక్షేమంలో కీలకమైన ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రంలోని ఫార్మసిస్టుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఫార్మసిస్టుల ఉద్యోగావకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలి. ఫార్మసీ కోర్సుపూర్తి చేసినవారికి ఫార్మసీ కళాశాలల్లో బోధన సిబ్బందిగా, డ్రగ్ కంట్రోల్ శాఖలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్లుగా, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లలో అసిస్టెంట్లుగా ప్రభుత్వం నియమించాలి. ఫార్మసీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలి. ఫార్మసిస్టుల పోస్టుల పరీక్షా ఫలితాలను వెంటనే ప్రకటించాలి. మెరిట్ అభ్యర్థులతో నియామకాలు చేపట్టాలి.

ఉప్పు భాస్కర్‌రావు,
రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు



పర్వతగిరిలో ఎర్రబెల్లికి తమ బాధలు చెప్పుకుంటున్న మహిళా రైతులు

# రైతుల బాధలు కనిపించడం లేదా?

**మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆగ్రహం**

పర్వతగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రికి రైతుల బాధలు కనిపించడం లేదా? అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంపై అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పర్వతగిరి మండల కేంద్రంతోపాటు కల్లెడ పీఏసీఎస్ వద్ద రైతుల దీనస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల గోడును విని ధైర్యం చెప్పారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులు అర్ధరాత్రి నుంచి క్యూలైన్లు కట్టి యూరియా కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని, పాలన చేతగాక కాంగ్రెస్ నాయకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

### సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే..

పర్వతగిరిలోని తన నివాసంలో దయాకర్‌రావు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పట్ల సైతం మేధావులు, యువకులు, మహిళలు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు.

అనంతరం పర్వతగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, లునావత్ పంతులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్‌రావు, గోనె సంపత్, దేవేందర్, రాజు, శ్రీనివాస్, వెంకన్న, మాధవరావు, శ్రీను, జిల్లా, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పరామర్శలు...

రాయపర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యతండాలో యూరియా క్యూలైన్‌లో జరిగిన తోపులాటలో గాయపడిన మునావత్ మాంజ్యా నాయక్‌ను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం పెర్కవేడు గ్రామంలోని గుంటూరుపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాకినేని వీరయ్య అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

సూర్యతండాకు చెందిన లైన్‌మన్ మునావత్ హన్మంత్ విధుల్లో ఉండగా జరిగిన ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతుండగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జట్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, పూస మధు తదితరులు పాల్గొన్నారు.

# పృథ్వీకి ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు

**రాష్ట్రపతి నుంచి స్వీకరణ**

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ పట్టణానికి చెందిన వర్ధమాన సినీ కళాకారుడు ఉప్పరి పృథ్వీకి జాతీయ స్థాయిలో ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు వరించింది. ఈ అవార్డును ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. పృథ్వీ తండ్రి శేఖర్ డోర్నకల్‌లో కుంగ్‌ఫూ మాస్టర్‌గా ఎంతోమందికి శిక్షణ ఇచ్చారు.

ఈ కళ ద్వారా రైల్వేలో ఉద్యోగం సాధించిన ఆయన అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత తెలుగు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా పనిచేస్తూ.. పలు చిత్రా ల్లో పాత్రలు పోషించారు. ఈ క్రమంలో తన కుమారుడు పృథ్వీకి కుంగ్‌ఫూలో శిక్షణ ఇచ్చారు. తన తండ్రి దగ్గర మెళకువలు నేర్చుకున్న ఆయన పలు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా కొరియోగ్రాఫర్‌గా పని చేశారు.

ఇటీవల ప్రకటించిన జాతీయ ఉత్తమ స్థాయి చిత్రాలలో ఒకటైన 'హనుమాన్' చిత్రంలో పృథ్వీ నటించడంతో పాటు స్టంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. దీంతో ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డోర్నకల్ ప్రాంత వాసులు పృథ్వీకి అభినందనలు తెలిపారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న డోర్నకల్‌కు చెందిన ఉప్పరి పృథ్వీ

# ఫోన్‌లోనే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు

- కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి
- కుడా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఇండ్లు నిర్మించుకునే వారు ఫోన్‌లోనే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చని కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డితో పాటు 120 గ్రామాల ఆర్‌ఐలు, పంచాయతీ సెక్రెటరీలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. బిల్డ్‌నౌ యాప్ ఏఐ సిస్టం ద్వారా భవన అనుమతులు నిమిషాల్లో పొందే విధంగా రూపొందించామ న్నారు. అధికారుల జోక్యం లేకుండా పారదర్శకతతో అనుమతులు జారీ చేస్తామన్నారు. దరఖాస్తుదారులు కార్యాలయా నికి రాకుండా ఇండ్ల వద్ద నుంచే అనుమతులు పొందవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందిస్తూ



మాట్లాడుతున్న కుడా చైర్మెన్ వెంకట్రాంరెడ్డి

వినియోగదారులు దరఖాస్తుల స్టేటస్‌లు తెలుపుతుందని అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనిచేసేందుకు బిల్డ్‌నౌ యాప్‌ను రూపొందించామన్నారు. అదే విధంగా ఇంటి స్థలం 75 గజాలలోపు ఉంటే దరఖాస్తును సమర్పించిన వెంటనే అనుమతులు జారీ అవుతాయన్నారు. టీడీసీపీ, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటి పారుదల శాఖ, రెవెన్యూ తదితర శాఖలన్నింటినీ బిల్డ్‌నౌ యాప్‌కు అనుసంధానం చేశామని వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా సిబ్బంది పాల్గొన్నారు.

# పథకాలు, పనులు అమ్ముకున్న చరిత్ర రాజయ్యది

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- చిలుపూర్‌లో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

చిలుపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత పదిహేనేళ్ళుగా నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి పనులు, పథకాలను అమ్ముకున్న చరిత్ర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో రూ. 53 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన అనతికాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతు రుణమాఫీతో పాటు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకా లను అమలు చేస్తున్న తీరు దేశానికే మార్గదర్శకమన్నారు. కేవలం 21 నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.1025 కోట్లను మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎమ్మార్వై అర్జున్, గడ్డమీది సురేశ్, రత్నాకర్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, ఎమ్డీ షకీల్, ఏడవెళ్ళి మల్లారెడ్డి, తాళ్ళపల్లి సమ్మయ్య, జీడి ఆనందం తదితరులు పాల్గొన్నారు.



చిలుపూర్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

### తాటికొండలో వనిత టీస్టాల్ ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సమాజంలో నేడు కుటుంబాలు జీవిస్తున్నాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఇందిరా మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా కుంబోజు మధుమాల-రాజు దంపతులు ఏర్పాటు చేసిన వనిత టీస్టాల్‌ను కడియం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ఏడు ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఏడు మండలాలకు ఏడు పెట్రోల్ పంప్‌లను మహిళా సంఘాలకు ఇచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాపోలు మధుసూధన్ రెడ్డి, బేతి జయపాల్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బేతి మంజుల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భళా పోలీస్!

- ఐనవోలు మండలంలో వినూత్న కార్యక్రమం
- ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతూ ప్రజలతో మాటామంతీ
- పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన
- వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు...



నందనంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ వెంకటేష్, సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఐనవోలు మండలంలో పోలీసులు బుధవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రజలను చైతన్య పరిచే ఉద్దేశ్యంతో గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతూ భరోసా కల్పించారు. ప్రజలతో స్వయంగా మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. నేరాలపై అప్రమత్తంగాఉండాలంటూ అవగాహన కల్పించారు. పండుగను ప్రశాంతంగా జరుపుకొని ఆనందంగా గడపాలని సూచించారు. మామునూరు ఏసీపీ వెంకటేష్ నేతృత్వంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్, పోలీసు సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ సూచనలు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు వివాదాలకు తావులేకుండా పండుగలు జరుపుకోవాలని కోరారు. పండుగల్లో రాజకీయాలు చేసి గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పండుగల వేళ చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి గ్రామంలో ప్రవేశ మార్గాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను యువతకు వివరించారు. సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. గస్తీ సందర్భం గా వివిధ గ్రామాల్లో బతుకమ్మలు ఆడే స్థలాలను పరిశీలించారు. కాగా, పోలీసులు ఈ చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# సాగునీటి చిక్కులు 'సమ్మక్క' తీర్చేనా!?

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ ప్రాజెక్టుకు ఇన్నాళ్లు కొర్రీలు పెట్టిన చత్తీస్‌గడ్ ప్రభుత్వం ఇటీవలే సానుకూల వ్యక్తం చేయటం రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. దేవాదులు మూడు దశల పనులు పూర్తి కావస్తుడటంతో పాటు భూసేకరణపై ప్రభుత్వం దృష్టి సారించటంతో దేవాదుల కల సాకారం అవుతుందనే ఆనందం రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో సాగునీటిపై కొత్త చిక్కులు తెరపైకి వస్తున్నాయి. సమ్మక్కసాగర్ నుంచి 2,51,310 హెక్టార్లకు సాగునీటితో పాటు ఎస్సారెస్పీ ఫేస్-2లో 1,78,000హెక్టార్ల (4.45 లక్షల ఎకరాలు) ఆయకట్టును స్థిరీకరించనున్నట్లుగా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లో పేర్కొన్నారు. అయితే ఇదే ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రభుత్వం చూపించింది. ఎస్సారెస్పీ-2 పరిధిలోని ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు, సమ్మక్కసాగర్‌లకు రెండింటికి డీపీఆర్‌లో చూపించటంపై కేంద్ర జలవనరుల సంఘం అభ్యంతరాలు తెలిపింది. ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టును కాళేశ్వరం ప్రాజక్టుకే పరిమితం చేస్తే, సమ్మక్కసాగర్ సంబంధించిన ప్రాజెక్టు ప్రయోజనాల వ్యయం(కాస్ట్ బెనిఫిట్‌రేషియో) తగ్గుతోంది. ప్రస్తుత డీపీఆర్‌లో ఒక రూపాయి ఈ ప్రాజక్టుపై ఖర్చు చేస్తే.. కొత్త పాత ఆయకట్టుల ద్వారా రూ.1.67 లాభం వస్తుందని సీడబ్ల్యుసీకి తెలిపారు. కానీ ఎస్సారెస్పీ-2 ఆయకట్టును తొలగిస్తే రూపాయిన్నర ఖర్చుకు రూపాయి వరకు కూడా ప్రయోజనం కనిపించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సమ్మక్క బ్యారేజ్ కింద కొత్తగా రెండు లక్షల ఆయకట్టును చూపాలంటూ కేంద్ర జల సంఘం సూచించింది.

### ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటి కష్టాలేనా..?

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.74లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ-1 కింద 3,64,078 ఎకరాల్లో, ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఈ ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా గత ప్రభుత్వం కేంద్ర జలమండలికి నివేదిక ఇచ్చింది. అయితే సమ్మక్కసాగర్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల కింద కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ-2 కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా ప్రభుత్వం సీడబ్ల్యుసీకి డీపీఆర్‌లో చూపించింది. రెండు ప్రాజెక్టుల కింద ఎస్సారెస్పీ ఆయకట్టును చూపించటంతో సీడబ్ల్యుసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో కొత్తగా పాకాల-బయ్యారం- రోళ్లపాడు వరకు సమ్మక్కసాగర్ నీటిని ఎత్తిపోయాలని ప్రభు త్వం ప్రణాళిక రూపొందిస్తోంది. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు నియోజకవర్గాలోని రైతులకు ప్రయోజనం చేకూరుతందని అంచనా వేస్తున్నారు. దీంతో ఎస్సారెస్పీ-2 కింద ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం పక్కన పెట్టింది. రెండేళ్లుగా కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయటం లేదు. ఎస్సారెస్పీ-2 కింద ఉన్న సమ్మక్కసాగర్ నీటిని పాకాల- బయ్యారం మళ్లిస్తే.. తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో 44,942 ఎకరాలు, వర్ధన్నపేటలో 9,012 ఎకరాలు, డోర్నకల్‌లో 55,558 ఎకరాలకు ఎస్సారెస్పీ-2 ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. భవిష్యత్తులో కూడా కాళేశ్వరం ఎత్తిపోతల చేపట్టే సూచనలు కనిపించటం లేదని, దీంతో ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టుకు మళ్లీ కరువు వస్తుందనే ఆవేదనలో రైతులు ఉన్నారు. దీంతో సీడబ్ల్యుసీ అభ్యంతరాలకు సమాధానం ఇచ్చి ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటిని మళ్లించాలా? లేక కొత్త ఆయకట్టు కోసం పాకాల- బయ్యారం వరకు సమ్మక్కసాగర్ నీటిని ఎత్తిపోసేలా కొత్త డీపీఆర్‌ను తయారు చేయాలా అనే సందిగ్ధం అధికారుల్లో నెలకొంది.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న రాంచంద్రునాయక్

## దేశంలోనే రేవంత్‌రెడ్డి పాలన ఆదర్శం

### డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని నిదానపురంలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో మాట్లాడారు. కేసీఆర్ పదేళ్లలో ప్రజల సొమ్మును అందినంత దోచుకున్నారన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో తాను రెండేళ్లలోనే రూ.500 కోట్ల నిధులను తెచ్చి పలు రకాలుగా అభివృద్ధి పర్చానన్నారు. మరిపెడకు కోర్టు, నర్సింహుల పేట, సిరోల్‌కు నూతన పీహెచ్‌సీ భవనాలు మంజూరు చేయించానన్నారు. పెద్దముప్పారం నుంచి కుక్కడంకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు శ్రీకారం చుట్టానని తెలిపారు.

కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఎంపీవో మహ్మద్ అఫ్జర్‌పాషా, మండల అధ్యక్షుడు భట్టునాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాము, మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్, గండి వెంకట్‌నారాయణగౌడ్,పొన్నోటి బాలాజీ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'లంబాడీల ఆత్మగౌరవ సభను సక్సెస్ చేయాలి'

నెల్లికుదురు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 28న నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్లు కర్నావత్ వెంకన్న, బోడల లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. నెల్లికుదురులోని విశ్రాంతి భవనంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడీల సమస్యల పరిష్కారం కోసం సభ నిర్వహిస్తున్నామని అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బానోత్ విజేందర్, గుగులోత్ నరేష్, బానోత్ రమేష్, గుగులోత్ శంకర్, భీముడు, నారాయణ, హచ్చు, మాస్సింగ్ బాదవత్ వీరన్న పాల్గొన్నారు.

## జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా సబిత

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా సబిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీడబ్ల్యూవోగా పని చేసిన ధనమ్మ జూన్ 30న పదవీవిరమణ చేయగా ఆమె స్థానంలో మానుకోట సీడీపీవో శిరీష ఇన్‌చార్జిగా డీడబ్ల్యూవోగా బాధ్యతలు అప్పగించారు. కాగా, ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ అధికారిగా పని చేస్తున్న సబిత మానుకోట జిల్లా సంక్షేమ శాఖాధికారిగా బదిలీపై వచ్చి, బాధ్యతలు స్వీకరించారు.

### జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా శ్రీనివాసరావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా కె.శ్రీనివాసరావు నియామకమయ్యారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా, జిల్లా యువజన క్రీడల అధికారిగా, డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా వివిధ హోదాల్లో శ్రీనివాసరావు విధులు నిర్వహించారు.

● జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిగా బి. శ్రీనివాసరావు అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిగా బుధవారం అదనపు బాధ్యతలు చేపట్టారు.



కేసముద్రం మార్కెట్లో నిరుపయోగంగా ఉన్న ధాన్యం ఆరబెట్టే యంత్రం



కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్నలను ఆరబెట్టుకునేందుకు కష్టపడుతున్న రైతులు

## లక్షలు వెచ్చించి.. కవర్ కప్పి..

- మార్కెట్లో నిరుపయోగంగా ధాన్యం ఆరబెట్టే యంత్రం
- 'తేమ' కోసం మొక్కజొన్న రైతుల ఇక్కట్లు

కేసముద్రం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సౌకర్యం కల్పించి మెరుగైన ధర ఇప్పించడమే వ్యవసాయ మార్కెట్ లక్ష్యం. అలాంటిది అన్నదాతలకు ఎంతో అవసరమైన నూతన యంత్రాన్ని రూ.లక్షలు వెచ్చించి తీసుకువచ్చి రోజుల తరబడి కవర్‌కప్పి ఉంచడంతో నిరుపయోగంగా మారిపోయింది. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు నిత్యం పదుల సంఖ్యలో రైతులు 300 నుంచి 400 క్వింటాళ్ల వరకు మొక్కజొన్నలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. అయితే మొక్కజొన్నల్లో 12శాతం తేమ ఉంటేనే నాణ్యమైన సరుకుగా పరిగణించి మంచి ధర వస్తుంది. మొక్కజొన్నకు ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఉండగా ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో సగటున రూ.1980 నుంచి రూ.2030 మధ్య ధరలతోనే వ్యాపారులు ఖరీదులు చేస్తున్నారు. వర్షాల కారణంగా రైతులు తీసుకువచ్చే మొక్కజొన్నల్లో అధికంగా 15 నుంచి 18 శాతం వరకు తేమ ఉంటోంది. దీంతో రైతులు మంచి ధర కోసం యార్డులోనే తమ మొక్కజొన్నలను మూడు రోజులు ఆరబెట్టుకొని విక్రయిస్తున్నారు.

### నిరుపయోగంగా రూ.19 లక్షల యంత్రం..

మార్కెట్‌కు నెల రోజుల క్రితం రూ.19లక్షల విలువైన ధాన్యం శుభ్రం చేసి ఆరబెట్టే యంత్రాన్ని మార్కెటింగ్ శాఖ పంపింది. ఈ యంత్రం ద్వారా వరి ధాన్యం, మొక్కజొన్న, తదితర పంట ఉత్పత్తులను చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయడమేకాకుండా ఆరబెట్టడం దీని ప్రత్యేకత. మొక్కజొన్నలను లాక్కొని యంత్రంలో పోసి శుభ్రం చేస్తూ అందులోనే ఉన్న ఆరబెట్టే విభాగం(డ్రయ్యర్)లోంచి సరుకు బయటకు రాగానే తేమశాతం తగ్గుతుంది. నిమిషాల వ్యవధిలోనే క్వింటాళ్ల కొద్ది మొక్కజొన్నలను ఈ యంత్రం శుభ్రం చేసి ఆరబెట్టగలదు. ట్రాక్టర్ ఇంజన్‌కు అనుసంధానం చేసి డీజిలును ఇంధనంగా ఉపయోగించుకొని స్వల్ప ఖర్చుతో రైతుల మొక్కజొన్నలను నాణ్యమైన సరుకుగా మారుస్తుంది. రైతులకు ఇంత ప్రయోజనం చేకూరే యంత్రాన్ని రోజుల తరబడి కవర్ కప్పి కార్యాలయం ముందు నిలిపిఉంచడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావును వివరణ కోరగా.. యంత్రాన్ని ప్రారంభించి, నడిపించే విధానాన్ని చూపేందుకు సంబంధిత కంపెనీకి చెందిన నిపుణులు రావాలని, వారికి సమాచారం అందించామని, త్వరలో రైతులకు ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఇప్పటికైనా కర్షకుల కోసం తీసుకువచ్చిన ధాన్యం శుభ్రంతోపాటు ఆరబెట్టే యంత్రాన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చి మొక్కజొన్న రైతులకు ప్రయోజనం కల్పించాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

## 'పిల్లల విద్యపై దృష్టి సారించాలి'

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాల్య సంరక్షణ, పిల్లల విద్యపై అంగన్‌వాడీ టీచర్లు దృష్టిసారించాలని గుండెంగ సెక్టార్ సూపర్ వైజర్ కోడి మంజుల అన్నారు. గూడూరు మండలం గుండెంగ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్-బీ.. పఢాయి-బీలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ఎర్లిచైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ద్వారా కార్యక్రమాల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలు మాత్రమే కాకుండ విద్యనందించే కేంద్రాలన్నారు. నూతన విద్యావిధానం ఈ సూత్రాలకు అనుగుణంగా మాతృభాషలో విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బోడ విజయ, బోడ వినోద, బాదావత్ వినోద, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## నేడు జీపీ, మునిసిపాలిటీల్లో బతుకమ్మ వేడుకలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, జిల్లా ప్రధాన ఆస్పత్రి, బాలసదనం, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఈనెల 25న బతుకమ్మ సంబురాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 27న జిల్లా కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలను పూలతో అలంకరించుకుని సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని విభాగాల్లో ఉన్న మహిళా సిబ్బంది బతుకమ్మ పండుగను నిర్వహించాలన్నారు.



మహ్మద్ ప్రవక్త బోధనల సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముస్లిం మతపెద్దలు, యువకులు

## సభను విజయవంతం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న మహ్మద్ ప్రవక్త మతబోధనల సభను విజయవంతం చేయాలని జమాతె ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహబూబియా మస్జీదు ప్రాంగణంలో ముస్లీం మతపెద్దలు, యువకులతో కలిసి బుధవారం మహ్మద్ ప్రవక్త బోధనల సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త సూచించిన శాంతి మార్గం నేటి సమాజానికి ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ సభకు కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని సమాజశాంతి స్థాపన కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభకు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ సత్తార్, హాఫీజ్, అబ్దుల్ హమీద్, మొహమ్మద్ ఖలీల్, అసద్ అలీఖాన్, ఇబ్రహీం అలీ, మొహమ్మద్ ఇస్మాయిల్, జానీ, చాంద్‌పాష, అబ్దుల్ రహీం, ఇమాముద్దీన్, ఇమామ్ సయ్యద్, బషీర్, జమీల్, కలీం, యూసూఫ్, సాదిక్‌భాయ్ పాల్గొన్నారు.

## ముగిసిన షూటింగ్‌బాల్ పోటీలు

నెల్లికుదురు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లికుదురులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడామైదానంలో 44వ రాష్ట్రస్థాయి అండర్ 19 షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో ప్రథమస్థానం సంగారెడ్డి, ద్వితీయ స్థానం యాదాద్రి భువనగిరి, తృతీయ స్థానం గద్వేల్, బాలికల విభాగంలో ప్రథమస్థానం గద్వేల్, ద్వితీయ స్థానం యాదాద్రి భువనగిరి, తృతీయ స్థానం సిద్దిపేట జిల్లాలు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన జట్లకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్‌ఇండియా ప్రధాన కార్యదర్శి జిత్‌రాజ్ తోమర్, రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపెల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ట్రోఫీని, మెడల్స్ అందచేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పాల్గొన్న షూటింగ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాందాస్, క్రీడల నిర్వాహకులు సీహెచ్.ఐలయ్య, డిప్యూటీ ఎస్‌వో జ్యోతి, జి.యాదయ్య, ఇమామ్ శంకర్‌నాయక్, మల్లయ్య, అమరేష్‌బాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ వేడుక



పాలిటెక్నిక్ కళాశాలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

కేసముద్రం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్.నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను రంగురంగుల పూలతో అలంకరించి సాంప్రదాయ పాటలు పాడుతూ కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ కళాశాలలో..

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : మానుకోట పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బలరాంనాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బతుకమ్మ పండుగను కళాశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

## కార్మిక హక్కుల కోసం పోరాడుదాం

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వంపై పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో బుధవారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికుల నడ్డి విరుస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో అన్నిరంగాల కార్మికులు, ఉద్యోగస్తులు, ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగంలో కార్మికులకు క్లైయిమ్స్ అందజేయడంలో కార్మిక శాఖ విఫలమైందన్నారు. ఏఐటీయూసీ కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతుందని వివరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్‌గా సేవలందించి ఇటీవల పదవీవిరమణ పొందిన ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా పని చేసిన చిర్ర లక్ష్మీనర్సమ్మను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, మంద శంకర్, జక్కరయ్య, శ్రీను, స్వామి, సౌమ్యశ్రీ, మెహబూబా, వరలక్ష్మి, పద్మ, సరిత, శేఖర్, యాకయ్య, ప్రవీణ్, రమణ పాల్గొన్నారు.

## లంబాడీల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్‌జాదవ్

● ఎల్‌జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్‌జాదవ్

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలో లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ, సభను జయప్రదం చేయాలని ఎల్‌జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్‌జాదవ్ పిలుపునిచ్చారు. గూడూరు మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అత్యధికంగా లంబాడీ జనాభా కలిగిన పార్లమెంట్ కేంద్రమైన మానుకోట జిల్లా కేంద్రంలో అన్ని గిరిజన లంబాడీ కుల సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, రాజకీయ, యువజన, నిరుద్యోగ, మహిళ కార్మిక, రైతు, వర్తక, సాంస్కృతిక కళాకారులు, సాదు సంఘాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకమై మానుకోట లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీని ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28న మానుకోట జిల్లా కేంద్రంలో వేలాది మందితో లంబాడీల ఆత్మగౌరవ శాంతియుత ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లంబాడీలు వలసవాదులు కాదని, దేశమూలవాసులని చెప్పారు. స్వాతంత్ర్యం రాకముందే బ్రిటిష్, నైజాం కాలం నుంచి ఎస్టీలుగా గుర్తించబడి ఉన్నట్లు చెప్పారు. కొన్ని లంబాడ కుల వ్యతిరేక శక్తులు స్వార్థ రాజకీయాల కోసం.. వ్యక్తిగత స్వార్థం కోసం అన్నదమ్ముళ్ల కలిసి ఉన్న గిరిజన తెగల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించాలన్నారు. వాస్తవ విషయాలు బాహ్య సమాజానికి తెలియజేసేందుకు ఆత్మగౌరవ ర్యాలీ, సభను జయప్రదం చేయాలన్నారు.

ఈ సమావేశంలో ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ భూక్య బాలునాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్, లంబాడీ రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ సభ్యుడు డాక్టర్ వాంకుడోతు గోపినాథ్, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర నాయకులు బానోత్ నర్సింహానాయక్, టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరునాయక్, బోడ శరత్, బానోత్ మంగీలాల్, వాంకుడోతు కటార్ సింగ్, బానోత్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



కమలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గూడూరు సొసైటీ చైర్మన్ లింగారెడ్డి, నాయకులు

గూడూరు, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లెపల్లిలో పాము కాటుతో మృతి చెందిన అజ్మీర కమలమ్మ చిత్రపటం వద్ద గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి బుధవారం నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. తర్వాత రూ.5 వేల నగదును మృతురాలు కుమారుడు రవికి అందించారు. నాయకులు చల్లా వెంకట్‌రెడ్డి, గుగులోతు కృష్ణనాయక్, సురేష్, భట్టు సారయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడికి ఎంపీల పరామర్శ



గంజి కళావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఇనుగుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి తల్లి కళావతి ఇటీవలె మృతి చెందడంతో ఆయన్ను బుధవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వద్దిరాజు కిషన్, లోక్‌సభ సభ్యుడు పోరిక బలరాంనాయక్‌లు వేర్వేరుగాపరామర్శించారు. ఈ సందర్భంగా కళావతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుజ్జునూరి బాబురావు సతీమణి రామతార వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. వారివెంట డీసీసీ అధ్యక్షుడు భరత్ చంద్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, ధీకొండ వెంకన్న, గుగులోత్ దస్రూనాయక్, కూరెల్లి సతీష్, ఏదళ్ల యాదవరెడ్డి, మేకల వీరన్నయాదవ్, బొబ్బిలి యాకూబ్‌రెడ్డి ఉన్నారు.

## బెల్టు షాపుల జోరు.. జనం బేజారు

(5వ పేజీ తరువాయి)

నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### రాత్రి వేళల్లో ఘర్షణలు..

ప్రధానంగా రాత్రి వేళల్లో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయని, దీంతో ఆ సమయంలో ఇళ్లనుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. కొంద రు పీకలదాకా తాగి రోడ్డుపై పడిపోతుండడంతో వారిని భుజానికెత్తుకొని ఇళ్లకు చేరుస్తున్న ఘటనలు రోజూ చూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు గ్రామాల వారీగా బెల్టు దుకాణాలకు అప్పుగా మద్యం ఇస్తుండడంతో వీటి సంఖ్య భారీగా పెరిగిపోతోందని, పెట్టుబడి కూడా లేకపోవడం.. భారీగా ఆదాయం వస్తుండడంతో గ్రామాల్లో పెద్దఎత్తున బెల్టు దుకాణాల సంఖ్య పెరిగి పోటీలు పడి అమ్మకాలు సాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇదంతా జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

### జిల్లాలో నమోదైన కేసులు ఇలా..

జిల్లాలో అక్రమంగా బెల్లం, పటిక, గుడుంబా రవాణాను నియంత్రించడానికి ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ల ఆధ్వర్యంలో 2025 జనవరి నుంచి ఆగస్టు వరకు 756 గుడుంబా కేసులు నమోదు అయ్యాయి. బెల్లం పానకం 85,810 లీటర్లను ధ్వంసం చేయగా.. 86,245 కిలోల బెల్లంను సీజ్ చేశారు. అక్రమంగా నిర్వహిస్తున్న 22 బెల్టు షాపులపై కేసులు నమోదు చేశారు. గంజాయి కేసులో పట్టుబడిన ఒకరిపై కేసు, 1087 మందిని బైండోవర్ చేసి అందులో 10మం దిని బ్రీచ్ కేసులో రిమాండ్‌కు పంపించారు. వెరసి జిల్లా వ్యాప్తంగా 1,224 కేసులను నమోదు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారికంగా ప్రకటించింది.

### అప్‌అండ్‌డౌన్ చేస్తే చర్యలు తీసుకుంటాం

### కిరణ్‌నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్



దసరా పండుగకు అక్రమంగా తరలించే బెల్లం, సారా, పటికను నియంత్రించడానికి ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్ ఫోర్స్‌మెంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు చేపడుతున్నాం. అధికారులు అందుబాటులో ఉంటూ నియంత్రణకు తమవంతు కృషి చేస్తున్నారు. అప్‌అండ్‌డౌన్ చేస్తున్నట్లు తమ దృష్టిలో లేదు. ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

## ఎంపీ కార్యాలయం ఎదుట డైలీవేజ్ వర్కర్ల నిరసన

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ- బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ పోరిక బలరాంనాయక్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. డైలీవేజ్ వర్కర్లు చేస్తున్న నిరాహార దీక్ష 13వ రోజుకు చేరింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ బలరాంనాయక్ సంబంధిత రాష్ట్ర మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. జీవో నెంబర్ 64 ప్రకారం వేతనాలు చెల్లించాలని, గతంలో మౌఖిక ఆదేశాలు ఇచ్చారని, దానిని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వర్కర్లు డిమాండ్ చేశారు. మధు, రాజు, ఉపేందర్, తాజోద్దీన్, మహేష్, ముత్తయ్య, మంగీలాల్, నాగరాజు, యాకూబ్, లింగ్యా పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరుశురాములు అన్నారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత వికాసంతో పాటు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిబాబు, అధ్యాపకులు అరవింద్, రమేష్, మహేందర్ పాల్గొన్నారు.

## వైద్య దంపతులపై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైద్య దంపతులపై దాడి చేసిన ఘటనలో ప్రభుత్వ వైద్యుడితో పాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్సై బి.మౌనిక బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకరబోడు కాలనీలో ఎస్‌వీ టవర్స్ సమీపంలో ఉంటున్న ప్రభుత్వ వైద్యురాలు రామావత్ పద్మ ఇంటిలోకి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రవీందర్, ధనుంజయ్, బి.ప్రశాంత్, అరుణ కలిసి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటి లోపలివైపు నుంచి తలుపులు వేసి తనను, తన భర్త రాంబాబును ఇష్టం వచ్చినట్లు కొడుతూ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసి చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మౌనిక తెలిపారు.